# హంసలను వేటాడొద్దు [5]

మూలం: బోరిస్ వాసిల్యేవ్

అనువాదం: కె. సురేష్



**అనువాదం:** హంసలను వేటాడొద్దు [5]

**మూలం:** డోంట్ షూట్ ద వైట్ స్వాన్స్

**మూల రచయిత:** బోరిస్ వాసిల్యెవ్

**అనువాదకుడు:** కె. సురేష్

ప్రచురణ: కినిగె పత్రిక http://patrika.kinige.com

కాలం: ఏప్రిల్ 2014

శాశ్వత లింకు : http://patrika.kinige.com/?p=2302

©Author.

**What can you do with this document?**

Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use

**What is not allowed by Owner of this document?**
Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

# హంసలను వేటాడొద్దు [5]

దీని ముందు భాగం

**జరిగిన కథ:** యెగార్ పొలుష్కిన్ అమాయకుడు. కానీ నిపుణుడైన వడ్రంగి. భార్య హారిటీనా అతణ్ణి అసమర్థునిగా జమకట్టి నిత్యం నస పెడుతూ, దెప్పి పొడుస్తూ ఉంటుంది. హారిటీనా చెల్లి మార్యా, ఆమె భర్త ఫ్యొడార్ ఇపటొవిచ్ బుర్యానోవ్ లు కూడా అదే ఊళ్ళో ఉంటారు. ఊరి చుట్టు పక్కల అడవులు కొట్టించి కలప వ్యాపారం చేసి ధనవంతుడైన ఫ్యొడార్ కి ఒక అటవీ వార్డెను వల్ల సమస్య ఎదురవుతుంది. అడవిలో చెట్లు నరకటం గురించి ప్రశ్నిస్తాడు, కలప అమ్మకాల జమాఖర్చులు చూపించమంటాడు. మరో పక్క యెగార్ తన రేవు దగ్గర ఉద్యోగంలో కూడా సమస్యలు ఎదుర్కుంటాడు. పడవల మీద గుర్తు కోసం నంబర్లు వేయమంటే, ఆ పనిలో ఆసక్తి కనిపించక, దానికి బదులు యెగార్ అక్కడ బొమ్మలు గీస్తాడు. బాతు, పందిపిల్ల, మందారపువ్వు.. ఇలా. ఇదంతా పొద్దున్న వచ్చి చూసిన రేవు అధికారి యకోవ్ ప్రొకోవిచ్ యెగార్ ని తిట్టి ఆ బొమ్మలు చెరిపేసి మళ్ళీ అంకెలు వేయమంటాడు. **ఇక చదవండి:—**

## 5

దానంతటికీ ఓడ్కాని నిందించాలి. నిజానికి తప్పు ఓడ్కాది కూడా కాదు, ఖచ్చితంగా అదేమిటో ఎవరికి మాత్రం తెలుసు. ఒక్కమాటలో చెప్పాలంటే దురదృష్టం.

సాధారణంగా యెగార్ చాలా తక్కువ తాగుతాడు: అతడి దగ్గర అంత డబ్బూ లేదు, అదంటే అంత ఇష్టమూ లేదు. అంతమాత్రంచేత దానిని తిరస్కరించేవాడని కాదు. ఆమాత్రం తెలివి అతడికి ఉంది. అంతటి మర్యాద అతడికి అంతగా దొరికేది కాదు. అతడి బావ ఫ్యొడార్ ఇపటొవిచ్ ఒక్కడే, సందర్భం వచ్చినప్పుడు మద్యం ఇచ్చేవాడు.

ఈ సందర్భాలు చాలా అరుదుగా ఉండేవి. అయితే యెగార్‌కి చాలా త్వరగా మత్తెక్కేది. బహుశా అతడి నరాలు అంత గట్టిగా బిగించిలేవేమో, లేదా అతడికి లోపల ఏదైనా జబ్బు ఉందేమో. లేక, సంవత్సరం పొడవునా బంగాళా దుంప, క్యాబేజి తప్పించి ఏమీ తిననందువల్ల ఏర్పడిన బలహీనతేమో. యెగార్‌కి చాలా త్వరగా మత్తెక్కుతుందనుకున్నాం, హారిటీనా పరిస్థితీ అంతే: అర గ్లాసు తాగితే చాలు ఆమె ముఖం కందగడ్డమాదిరి ఎర్రబడేది, గ్లాసు మొత్తం

తాగిందంటే పాటలు అందుకునేది. ఆమెకు చాలా చాలా పాటలు వచ్చు, కానీ కొంచెం ఓడ్కా తాగిన తరువాత ఆమె పల్లవులు మాత్రమే పాడేది. అలాగని అన్ని పల్లవులు కాదు, ఒకే పల్లవి పాడేది. ఒకే ఒక్క పల్లవి, అది కూడా విషాద పాట:

అయ్యో, అయ్యో, అయ్యో.

నా కష్టాలు ఏమి చెప్పుదునయ్యా!

చినదానను, చక్కనిదాననయ్యా,

ఎవరు గట్టెక్కింతురయ్యా...

అంటే మద్యం ఆమెను విషాదంలో ముంచేదన్నమాట. ఒక్కొక్కరి శరీరంలో మద్యం ఒక్కొక్క భాగంలోకి వెళుతుంది – కొందరికి గొంతులోకి, కొందరికి పిడికిలిలోకి, కొందరికి హృదయంలోకి, కొందరికేమొ తలలోకి. యెగార్ విషయానికి వస్తే అది అతడి కాళ్లలోకి వెళ్లేది. తాగిన తరువాత అతడి కాళ్లు అతడిని నిలబెట్టలేకపోయేవి. అవి అన్నివైపులకి తిరిగిపోయి, ఎంతగా మెలిపడిపోయేవంటే రెండు కాదు ఎనిమిది కాళ్లున్నాయని ఎవరైనా ఒట్టేసి చెబుతారు. తాగినప్పుడు యెగార్‌పై ప్రభావం ఎప్పుడూ ఒకేరకంగా ఉండేది: అతడు ఎంతో సంతోషంగా మారి, అందరినీ ఎంతగానో ప్రేమించేవాడు. వాస్తవానికి అతడు తాగనప్పుడు కూడా అందరినీ ఎంతగానో ప్రేమించేవాడు.

ఆ రోజు ఉదయం మొదటి పర్యాటకులు వాచ్చారు: ఇద్దరు మహిళలతో పాటు ముగ్గురు పురుషులు. వాళ్లు చాలా దూరంనుంచి వచ్చినట్టు ఉంది: చాలా సంచులు ఉన్నాయి. వాళ్లు స్థానికుల్లాగా లేరు: మగవాళ్లందరూ గుండీలున్న ప్యాంటులు వేసుకున్నారు, టోపీలు లేవు. ఆడవాళ్లు తెల్ల టోపీలు పెట్టుకుని అదే రకమైన ప్యాంటులు వేసుకున్నారు, తేడా అల్లా అవి చాలా బిగితుగా ఉన్నాయి. ఎంత బిగుతుగా ఉన్నాయంటే యెగార్ వాళ్లవైపు దొంగ చూపులు చూడసాగాడు. చూడగూడదనుకుంటాడు, కానీ కాసేపటికే తన మీద పట్టు కోల్పోయి మళ్లీ అటే చూస్తాడు: చూడటానికి అక్కడ ఏదో ఉంది మరి.

“స్వాగతం, మిత్రులారా, స్వాగతం,” యకోవ్ ప్రొకొపిచ్ మాట్లాడుతున్నట్లుకాక పాడుతున్నట్లు ఉంది. మర్యాద సూచకంగా తన టోపీ తీసేశాడు. “కుతూహలంకొద్దీ అడుగుతున్నాను, ఎక్కడినుంచి వచ్చారు మిత్రులారా?’

"మేం వచ్చిన చోటు ఇక్కడికి కనపడదు," వాళ్లు బదులిచ్చారు. "మమ్మల్ని చెరువుకి ఆవలివైపుకి తీసుకెళ్ల గలుగుతారా?"

"తప్పకుండా," టోపీ తిరిగి పెట్టుకుంటూ యకోవ్ ప్రొకొపిచ్ తన సంతోషాన్ని దాచుకునే ప్రయత్నం చేశాడు. "మరపడవలో మిమ్మల్ని తీసుకెళతాం. అయితే మీరు పోను, రాను బాడుగ కట్టాలి."

"అలా ఎందుకు?"

"మీరు అడిగిన చోటుకి పడవ మిమ్మల్ని తీసుకెళుతుంది. అయితే అది వెనక్కి ఖాళీగా రావాల్సి ఉంటుంది."

"అది న్యాయమే," అంటూ రెండవ వ్యక్తి పర్సు తీసి డబ్బులిచ్చాడు.

వాళ్ల ముఖాలనుబట్టి యెగార్ వాళ్లని గుర్తుపెట్టుకున్నాడు: బూడిద జుట్టోడు, బట్టతలోడు, సగం బట్టతలోడు. ఆడవాళ్లను కూడా అలాగే గుర్తుపెట్టుకున్నాడు: ఎర్రటి అమ్మాయి, రాగిజుట్టు అమ్మాయి. ఆడవాళ్లు దేంట్లోను కల్పించుకోలేదు: అన్ని విషయాలు బూడిద జుట్టోడు, సగం బట్టతలోడే మాట్లాడారు. బట్టతలోడు ప్రకృతిని ఆస్వాదిస్తున్నాడు.

"ఇక్కడ చేపలు బాగా దొరుకుతాయా?" అతడు అడిగాడు.

ఆడవాళ్లు తమ సామానులు తీసుకోటంలో మునిగిపోయారు. కోల్కా ఆ పక్కనే ఉన్నాడు. బడికి సెలవలు ఇవ్వటంతో అప్పుడప్పుడు వచ్చి తండ్రికి సహాయపడుతున్నాడు. ఆడవాళ్లు అతన్ని పట్టించుకోలేదు. కానీ ఎర్రటి అమ్మాయి ఒక సంచిలోంచి బైనాక్యులర్స్ (నిజంగా అది అద్భుతమైన బైనాక్యులర్స్!) బయటకుతీసేసరికి అతడు ఆకర్షితుడయ్యాడు, ఏదో అయస్కాంతం లాగినట్టు.

"ఎంత ముద్దొచ్చే అబ్బాయి!" అంది రాగిజుట్టు అమ్మాయి. "నీ పేరేమిటి, అబ్బాయి?"

"కోల్కా," అన్నాడు కోల్కా, పెద్దవాడిలా అనిపించటానికి అతడు బొంగురు గొంతులో సమాధానం ఇచ్చాడు.

"ఇక్కడ పుట్టగొడుగులు బాగా దొరుకుతాయా, కోల్కా?"

"పుట్టగొడుగులు రావటానికి ఇంకొంచెం సమయం ఉంది," కోల్కా కంఠం పెద్దగా పలికింది. "తెల్ల రకాలు అక్కడక్కడా వస్తున్నాయి కానీ గోధుమ రకం మొదటి పొరకి ఇంకా సమయం ఉంది."

“మొదటి ఏమిటి?” ఎర్రటి అమ్మాయి బైనాక్యులర్స్ కిందికి దించి మరీ అడిగింది.

“మొదటి పొర ఇంకా రాలేదు,” కోల్కా వివరించాడు, అతడి కాళ్లు అతడికి తెలియకుండానే బైనాక్యులర్స్ వైపుకి కదిలాయి. “పుట్టగొడుగులు పొరల్లో వస్తాయి: మొదట గోధుమవి, తరువాత ఎర్ర టోపీలు, ఉడత ముద్దలు వస్తాయి. ఆ తరువాతే అసలైన పుట్టగొడుగులు వస్తాయి: పాలనురగలు, జున్నుముక్కలు.”

“చాలా పుట్టగొడుగులు వచ్చినప్పుడు దానిని పొర అంటారు, అంతేనా?”

“అవును. అప్పుడు వాటిని తెచ్చుకోటానికి వెళ్లవచ్చు, అప్పటిదాకా వృధా శ్రమే అవుతుంది.”

బైనాక్యులర్స్ వైపుకి అతడు ఇంకొక అడుగు ముందుకు వేశాడు: అతడి పొట్ట దానిని తాకుతున్నట్టుగా ఉంది. దాని మీద నుంచి అతడు తన చూపును మరల్చలేకపోతున్నాడు. మరి అవి నిజమైన బైనాక్యులర్స్, మిత్రులారా!

“నీకు దీంట్లోంచి చూడాలని ఉందా?”

అవును అనాలనుకున్నాడు కోల్కా; అతడి నోరు తెరుచుకుంది కానీ “అవును” కి బదులు ఏదో గరగర శబ్దం చేసాడు. ఏమీ అర్థంకాని గరగర అది, అయినా ఎర్రటి అమ్మాయి బైనాక్యులర్స్ ని అతడి ముందుకి చాచింది:

“పడెయ్యకుండా జాగ్రత్తగా చూడు.”

“అలాగే.”

మరపడవని సిద్ధం చేస్తూ యకోవ్ ప్రొకొపిచ్ ఆదేశాలను నాన్న వింటూ ఉండగా, కోల్కా బైనాక్యులర్స్ లోంచి చూస్తున్నాడు. చిన్నగా ఉన్నవైపునుంచి చూస్తుంటే అన్నీ పెద్దగా కనపడుతున్నాయి. పెద్దగా ఉన్నవైపునుంచి చూస్తుంటే అన్నీ చిన్నగా కనపడుతున్నాయి. ఇది అతడికి ఏమాత్రమం అర్థం కాలేదు: పెద్దగా ఉన్నవైపునుంచి పెద్దగా, చిన్నగా ఉన్నవైపునుంచి చిన్నగా కనపడాలి కదా? ఇదేమో అలా లేదు. బైనాక్యులర్స్ కంటే ఎక్కువ కాకపోయినా ఈ వింత ప్రవర్తన కోల్కాని బాగా ఆకట్టుకుంది: దానిని తిప్పుతూ రెండువైపులనుంచి ఒక కాకిని చూస్తూ ఉన్నాడు.

"దానిని అటూ, ఇటూ ఎందుకు తిప్పుతున్నావు?" ఎర్రటి అమ్మాయి అడిగింది. "ఇదిగో, ఈవైపునుంచి చూడాలి."

"నాకు తెలుసు," కోల్కా మెల్లగా బదులు ఇచ్చాడు.

"మరి దానిని ఎందుకు తిప్పుతూ ఉన్నావు?"

"ఊరికే," బిడియంగా బదులిచ్చాడు కోల్కా. "అలా చేయటం బాగుంది."

"కోల్కా!" యెగార్ అతడిని పిలిచాడు. "ఇటొచ్చి నాకు సహాయం చెయ్యి."

బైనాక్యులర్స్ ని కోల్కా ఎర్రటి అమ్మాయి చేతుల్లో పెట్టి ధన్యవాదాలు చెబుదామనుకున్నాడు కానీ అతడి గొంతు నుంచి గరగరమన్న శబ్దం తప్పించి రాలేదు. దాంతో తన కృతజ్ఞతలు తెలియచేయకుండానే అక్కడినుంచి పరుగుపెట్టాల్సి వచ్చింది. "అడివి మనిషి," అంది రాగిజుట్టు అమ్మాయి.

"వాణ్ణి పట్టించుకోవద్దు," చేతిని బద్ధకంగా ఊపుతూ అంది ఎర్రటి అమ్మాయి. "పెంపకం సరిగా లేదంతే."

యకోవ్ ప్రొకొపిచ్ నిశిత చూపుల కింద యెగార్ తొమ్మిదవ నెంబరు పడవను (దాని కింద యెగార్ అంతకు ముందు వేసిన బొద్దుగా ఉన్న బాతుపిల్ల బొమ్మ ఇంకా కనపడుతూనే ఉంది) మరపడవకి తగిలించి పెట్రోలు డబ్బాను పెట్టుకున్నాడు. కోల్కా తెడ్లు, ఇంకా అవసరమైన ఇతర సామాను తెచ్చాడు.

"అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి, యకోవ్ ప్రొకొపిచ్," యెగార్ చెప్పాడు.

"ముందు ఒకసారి నడిపి చూడు," యెగార్‌కి ఆదేశాలు ఇచ్చి పర్యాటకులకు వివరించసాగాడు యకోవ్: "మరపడవలో మొదటి విహారం ఇదే. ఏ పొరపాటు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం."

"ఇదంతా తొందరగా ముగిస్తారా?" బట్టతలోడు చిరుకోపం ప్రదర్శిస్తూ అడిగాడు.

"ఇవన్నీ చేయాలి, పర్యాటక పౌరులారా: భద్రతా అవసరాలు. పొలుష్కిన్, ఇక కానియ్యవోయ్."

భద్రతా అవసరాలను యకోవ్ ప్రొకొపిచ్ అప్పటికప్పుడు కల్పించాడు, అసలు అటువంటివేమీ లేవు. అతడు తన భద్రత గురించి జాగ్రత్తపడుతున్నాడు.

"పొలుష్కిన్, మరపడవను స్టార్ట్ చేసి, అదిగో అల్లంత దూరం పోనిచ్చి, వెనక్కి తిప్పి మళ్లీ ఇక్కడకు తీసుకురా."

"సరే."

కోల్కా తెడ్డువేసి మరపడవని తీరంనుంచి కొంత దూరం తీసుకెళ్లాడు. యెగార్ మోటారుకి తాడు చుట్టి ఒక్క లాగులాగి దానిని స్టార్ట్ చేశాడు. కాసేపు ఊరికే ఆడనిచ్చి తరువాత ప్రొపెల్లర్‌కి తగిలించి ముందుకి పోనిచ్చాడు. డైరెక్టరు మనశ్శాంతి కోసం మరపడవని ఒక చుట్టు తిప్పి తీసుకొచ్చాడు. రేవులోకి తిరిగి వచ్చేటప్పుడు మోటారును సరైన సమయానికి ఆపేసి ఎటువంటి కుదుపులు లేకుండా పడవని నిలిపాడు. అతడి ముఖం నవ్వుతో వెలిగిపోయింది:

"అంతా బాగుంది, యకోవ్ ప్రొకొపిచ్!"

"మరపడవను నడపటం నీకు తెలుసు," అన్నాడు డైరెక్టరు. "సామానులు ఎక్కించుకోటానికి అనుమతి ఇస్తున్నాను."

యెగార్, అతని కొడుకు తీరం మీదకి ఉరికి ఆలస్యం చేయకుండా సామానంతటినీ పడవలోకి ఎక్కించారు. పర్యాటకులు తమతమ చోట్లలో కూర్చున్నారు. ముందు భాగంలో ఉన్న కోల్కా పడవని కొంచెం నెట్టాడు. యెగార్ మరొకసారి మరపడవని స్టార్ట్ చేసి అడవి ఉన్నవైపుకి దూసుకుపోయాడు.

పర్యాటకులు దారిలో ఏమి మాట్లాడుకున్నారో యెగార్ గాని, కోల్కా గాని వినలేదు. మోటారు చప్పుడు వల్ల యెగార్‌కి ఏమీ వినపడలేదు, కోల్కానేమో ముందుభాగంలో కూర్చుని వెనక్కి వెళుతున్న అలలను, మెల్లగా చేరువౌవుతున్న అవతలి తీరాన్ని చూస్తూ ఉన్నాడు. పర్యాటకుల గురించి ఆలోచించే సమయం కోల్కాకి లేదు: అతడు అన్వేషణలో ఉన్న నావికుడు. తన దిక్సూచిని ఇంటి దగ్గర వదిలిపెట్టి వచ్చినందుకు అతడు బాధపడసాగాడు. అంతేకాకుండా ఎర్రటి అమ్మాయి తనకి ముందుగానే బైనాక్యులర్స్ ఇచ్చింది. ఆ బైనాక్యులర్స్ అవసరం అతడికి ఇప్పుడుంది!

పర్యాటకులు చెరువు కొత్తదని, దాంట్లో చెప్పుకోదగిన చేపలు ఉండవని అనుకుంటున్నారు. వాళ్ల మాటల్లో అప్పుడొకటి, ఇప్పుడొకటి యెగార్ చెవిలో పడుతున్నాయి కానీ, తనకు అప్పగించిన గురుతరమైన బాధ్యత వల్ల వాటిని అతడు అంతగా పట్టించుకోవటంలేదు. అంతేకాకుండా ఈ ప్రశాంతమైన వాతావరణంలో కొన్ని రోజులపాటు గడపటానికి వచ్చిన ఈ అపరిచితులతో అతడికి

ఏం పని ఉంది! తన పనేంటో తనకి తెలుసు: వాళ్లు తీసుకెళ్లమన్న చోటుకి తీసుకెళ్లటం, గుడారం ఏర్పాటు చేసుకోవటంలో సహకరించటం, వెళ్లిపొమ్మన్నప్పుడు వెళ్లిపోవటం.

"ఆ గుట్టమీదకు తీసుకెళ్లు!" బూడిద జుట్టోడు ఆజ్ఞాపించాడు. "మేం ఒక్కసారి అంతా కలియచూసి వస్తాం."

వాళ్లు మొత్తం మూడు ప్రదేశాలు చూసి వచ్చారు. చివరికి ఎర్రటి అమ్మాయి, రాగిజుట్టు అమ్మాయి ఏకాభిప్రాయానికి వచ్చారు. తరువాత తమ సామాను దింపమని చెప్పారు. గుడారానికి ఎంపిక చేసిన ప్రదేశం వరకు సామాను చేర్చటంలో యెగార్, అతని కొడుకు సహాయపడ్డారు.

చుట్టూ దట్టమైన కవుకు చెట్లు ఉన్న ఖాళీ ప్రదేశం అది.

ఇక్కడ పర్యాటకులు అల్యుమినియం గెడల మీద పసుపుపచ్చ గుడారాన్ని క్షణాల్లో వేసేశారు, చూరు, తలుపులతో సహా. మంటవెయ్యటానికి తగిన స్థలం తయారు చేసే బాధ్యత యెగార్‌కి అప్పచెప్పారు. ప్లాస్టిక్ తెప్పలలోకి గాలి ఊదే పనిని కోల్కాకి అప్పగించారు. కోల్కా ఆ పనిని చాలా సంతోషంగా చేపట్టాడు. అంతా సరిగా చెయ్యాలన్న ఆదుర్దాతోనూ, తెప్పలలోకి గాలి ఊది, ఊది అతడి ముఖం ఎర్రబడిపోయింది. ఈలోగా సగం బట్టతలోడి నుంచి కొడవలి తీసుకున్నయెగార్ మంటకి కట్టెపుల్లలకోసం వెళ్లాడు.

"ఎంత అందమైన ప్రదేశం!" రాగిజుట్టు అమ్మాయి అంది. "గాలి ఎంత హాయిగా ఉంది!"

"ఇక్కడ అంతగా చేపలు లేవని నాకు అనిపిస్తోంది," అన్నాడు బూడిద జుట్టోడు. "ఓయ్, అబ్బాయ్. ఇక్కడ చేపలెలా ఉంటాయి?"

"మట్టగుడిసెలు," రొప్పుతూ బదులిచ్చాడు కోల్కా (ఆ సమయంలో అతడు తెప్పలోకి గాలి ఊదుతున్నాడు).

"మట్టగుడిసె పులుసుకే బాగుంటుంది.ఇంకేమైనా మంచి చేపలున్నాయా?"

"లేవు."

ఇంకా వేరే చేపలు ఉండిఉండవచ్చు, కానీ కోల్కా తన వయస్సు, అనుభవంవల్ల మట్టగుడిసెలు పట్టుకోటానికే పరిమితమయ్యేవాడు. అదీకాకుండా అతడు తెప్పలను ఊదటంలో తలమునకలై ఉన్నందున మాట్లాడటానికి అంతగా ఆసక్తి కనపరచలేదు.

"నువ్వు చేపలను బాగా పడతావా?" బట్టతలోడు అడిగాడు.

"లేదు."

తన సమాధానాలాను కోల్కా ఒక్క పదానికే పరిమితం చేస్తున్నాడు. పెద్ద సమాధానం ఇవ్వాలంటే ఊదటం ఆపాలి, దాంతో తెప్పలోని గాలి బయటకు వచ్చేస్తుంది. గాలి బయటకు పోకుండా ఉండటానికి దాని మూతిని వేళ్లతో నొక్కి పట్టి ఉంచాడు కానీ అక్కడ ప్లాస్టిక్ గట్టిగా ఉండటంవల్ల కోల్కాకి బలం సరిపోవటం లేదు.

"మీ నాన్న సంగతి ఏమిటి – అతడు చేపలను బాగా పడతాడా?"

"లేదు."

"ఏం?"

"ఏమో."

"బాగుంది సంబాషణ," రాగిజుట్టు అమ్మాయి నిట్టూర్చింది. "వాడో అడివి మనిషని నేను చెప్పానా?"

"నువ్వు మంచి అబ్బాయివి, కోల్కా," ఎర్రటి అమ్మాయి నుండి అనుకోని పొగడ్త లభించింది. "నువ్వు తెప్పలను బాగా ఊదుతున్నావు. అలసిపోయావా?"

"లేదు."

అది తిట్టడం అని తెలుస్తోంది కాని తాను "అడివి మనిషి" ఎలా అయ్యాడో కోల్కాకి అర్థం కాలేదు. కాని అతడు దానిని పట్టించుకోదలుచుకోలేదు: అతడికి అంత సమయం లేదు, అదీగాక ఎర్రటి అమ్మాయి అతడిని ఆపాటికే మెచ్చుకుంది. ఆమె మెప్పుకోసం కోల్కా అయిదు కాదు యాభైఅయిదు తెప్పలనైనా విశ్రాంతి తీసుకోకుండా ఊదటానికి సిద్ధంగా ఉన్నాడు.

కానీ అయిదవ తెప్పను ఊదబోయేసరికి కోల్కా ఎంత అలసిపోయాడంటే అతడి తల ఖాళీ కుండలాగా అనిపించసాగింది. అతడు భారంగా ఊపిరి తీయసాగాడు, ముఖం కందగడ్డలాగా మారింది, రొప్పుతూ ఉన్నాడు, కానీ ఊదటం మాత్రం ఆపలేదు: ఆ పని పూర్తి చెయ్యాలి, పైగా తెప్పలు ఊదే పని రోజూ దొరికేది కాదు. అంతేకాదు, ఆ తెప్పమీద చెరువులో విహారం చేస్తారు. దాంతో శక్తినంతటినీ కూడగట్టుకుని ఊదటంలో నిమగ్నమైపోయాడు, ఎంతగా అంటే పర్యాటకులు మాట్లాడుకుంటున్నదేదీ అతడి చెవిన పడలేదు. ఆఖరి తెప్ప ఊదటం పూర్తయ్యి, దాని మూత బిగించి కొద్దిగా ఊపిరి తీసుకుంటున్న సమయానికి వాళ్ల నాన్న బండిగురువింద తోపునుంచి

బయటకు వస్తున్నాడు. మంటకి అతడి చేతిలో ఎండు ఫిర్ కొమ్మలు ఉన్నాయి. "మిత్రులారా, మనం ఎంచుకున్న ప్రదేశం మరీ అంత మంచిది కాదేమోనని అనిపిస్తోంది. ఆ తోపులో చీమల పుట్ట ఉంది: అవి మిమ్మల్ని ఇబ్బంది పెడతాయి. మనం ఇంకా ఎక్కడికైనా మారాలి," అన్నాడు.

"ఆ చీమలపుట్ట చాలా పెద్దదా?" అడిగాడు బూడిద జుట్టోడు.

"తొట్టంత పెద్దది," చెప్పాడు యెగార్. "ఎన్నో ఏళ్లుగా స్థిరపడిన కుటుంబం లాగా ఉంది."

"చాలా ఆసక్తికరంగా ఉంది!" అంది ఎర్రటి అమ్మాయి. "దానిని నాకు చూపిస్తావా?"

"తప్పకుండా," అన్నాడు యెగార్.

చీమలపుట్టను చూడటానికి అందరూ వెళ్లారు, కోల్కా కూడా వెళ్లాడు: కొంచెం నడిస్తే ఊపిరి మళ్లీ మామూలుగా అవుతుందని అతడు అనుకున్నాడు. తోపులో బండిగురువింద చెట్ల మొదటి వరస దాటగానే అది వాళ్లకి కనపడింది: కొండ లాగా ఉందది. తొట్టి ఏమిటి, అది స్నానాల గది మాదిరి పెద్దగా రెండు గజాలైనా పొడవుంటుంది.

"ఆకాశహర్మ్యం!" అన్నాడు సగం బట్టతలోడు. "ప్రకృతి అద్భుతం." అక్కడంతా చీమలు హడావుడిగా తిరుగుతూ ఉన్నాయి – లెక్కపెట్టలేనన్ని చీమలు. అవి ఎర్ర గండుచీమలు. అవి కుట్టాయంటే మంటతో గంతులు వేయాల్సిందే. కోల్కా వాటికి సాధ్యమైనంత దూరంలో ఉన్నాడు (అందులో అతడికి చెప్పులు కూడా లేవు).

"వీటితో మాచెడ్డ సమస్య," అన్నాడు యెగార్. "కొంచెం అవతలగా నేను మరొక ఖాళీ ప్రదేశం చూశాను. మీరు అక్కడికి మారటంలో నేను సహాయం చేస్తాను: ఆ రకంగా మీకు ప్రశాంతత ఉంటుంది, వాటికి ఆటంకం ఉండదు."

"ఈ చీమలు కీళ్లనొప్పులకు మంచివి," అన్నాడు సగం బట్టతలోడు. "కాబట్టి ఎవరికైనా కీళ్ల నొప్పులుంటే..."

"అబ్బా!" అరిచింది రాగిజుట్టు అమ్మాయి. "ఎంత గట్టిగా కుట్టింది, పిల్ల రాక్షసి!"

"అవి వాసన పసిగడతాయి," చెప్పాడు యెగార్. "అవి స్వతంత్ర జీవులు."

"అవును," బట్టతలోడు నిట్టూర్చాడు. "మంచి పొరుగు కాదు."

"ఏం భయంలేదు!" చెయ్యి ఊపుతూ అన్నాడు బూడిద జుట్టోడు: "మనం వాటిని జయిస్తాం! ఓయ్, నీ పేరేమిటన్నావు? యెగార్? కొంచెం పెట్రోలు ఉంటే ఇస్తావా, యెగార్? ఒక డబ్బా ఉందా?"

పెట్రోలు ఎందుకో యెగార్‌కి అర్థం కాలేదు, అయినా మరపడవలో ఒక డబ్బాలో పెట్రోలు ఉంటే అది తీసుకొచ్చి ఇచ్చాడు. దానిని బూడిద జుట్టోడికి ఇచ్చాడు, "ఇదిగో."

"నువ్వు మంచోడివోయ్," అన్నాడు బూడిద జుట్టోడు. "నీ తెలివిని పరిగణనలోకి తీసుకుంటాం. సరే, అందరూ ఒక్క అడుగు వెనక్కి వేయండి."

అలా అంటూ అతడు డబ్బాలోని పెట్రోలంతా చీమలపుట్ట మీద గుమ్మరించాడు. పెట్రోలు చల్లి అగ్గిపుల్ల గీశాడు – ఒక్కసారిగా మంట ఆకాశానికి ఎగిసింది. అది బుసకొడుతూ క్షణకాలంలో ఆ పెద్ద చీమలపుట్టనంతటినీ కమ్ముకుంది.

పాపం ఆ పిపీలికాలు భరించలేని వేడికి మాడిపోతా అటూ, ఇటూ పరిగెత్తసాగాయి. ఎండుపుల్లలు టపటపమంటూ మండసాగాయి. ఎన్నో పుష్కరాలపాటు ఆ చీమల సామ్రాజ్యానికి ఆశ్రయమిచ్చిన ఆ పెద్ద బండిగురువింద చెట్టు కూడా నింగికి ఎగుస్తున్న మంటకు గజగజలాడసాగింది.

యెగార్, కోల్కాలు నోటమాటరాక నిలబడిపోయారు. మంట వేడిమి వాళ్ల ముఖాలకు తగలకుండా చేతులు అడ్డం పెట్టుకుని అలా చూస్తూ ఉండిపోయారు: మాడిపోయి, కాలిపోతున్నా ఆ చీమలు పుట్టనుంచి పారిపోవటంలేదు. అందుకు విరుద్ధంగా కనీసం ఒక్క గుడ్డునైనా కాపాడుకుందామని మరణాన్ని ధిక్కరిస్తూ మంట మధ్యలోకి మొండిగా నడుస్తున్నాయి. కొట్లాది చీమలు శ్రమపడి కట్టిన ఆ పెద్ద పుట్ట తమ కళ్లముందే మాడి, మసై పోవటం తండ్రి, కొడుకులు చూస్తుండిపోయారు – ఆ పెద్ద బండిగురువింద చెట్టు ఆకులు వేడికి ముడుచుకుపోసాగాయి, అన్నివైపుల నుంచి వేలాది చీమలు మంటలోకి పరిగెత్తసాగాయి.

"భలే, భలే టపాసులు!" రాగిజుట్టు అమ్మాయి సంతోషంతో కేకలు పెట్టింది. "మనదే విజయం!"

"అదీ విషయం," గర్వంగా అన్నాడు బూడిద జుట్టోడు. "ప్రకృతికి మనిషే రాజు. కదా, అబ్బాయీ?"

"రాజా?" దిమ్మెరపోయి ఉన్న కోల్కా పలికాడు.

"రాజు, అబ్బాయి. అన్నింటినీ ఓడించినవాడు, విజేత."

ఆ చీమలపుట్టంతా తగలబడిపోయి బూడిద మిగిలింది. బట్టతలోడు దానిని ఒక పుల్లతో పొడిచాడు, చిన్న మంట గుప్పుమని లేచి ఆరిపోయింది. చనిపోని చీమలు బూడిద రాశిలో అటూ, ఇటూ కంగారుగా తిరగసాగాయి.

"ఈ భూమి మీద మన స్థానాన్ని సంపాదించుకున్నాం," బట్టతలోడు వివరించాడు. "ఇప్పుడు మనల్ని ఎవరూ ఇబ్బంది పెట్టరు, మనకు ఎవరూ అడ్డురారు."

"ఈ విజయానికి మనం పండగ చేసుకోవాలి," అన్నాడు సగం బట్టతలోడు.

"ఏదో ఒకటి ఆలోచించండి, అమ్మాయిలూ."

"అవును," అంటూ బూడిద జుట్టోడు బలపరిచాడు. "మన మిత్రుడికి ధన్యవాదాలు తెలపాలి."

"చీమలకు అంతిమ సంస్కారం కూడా చెయ్యాలి!" బట్టతలోడు పెద్దపెట్టున నవ్వాడు.

అందరూ తరిగి గుడారం వైపుకి నడవసాగారు.

అయోమయంలో ఉన్న యెగార్ వాళ్ల వెనకే కాళ్లు ఈడ్చుకుంటూ వెళుతున్నాడు. అంతకుముందు అతడే వాళ్లకి ఎంతో ఉత్సాహంగా ఇచ్చిన ఖాళీ పెట్రోలు డబ్బా అతడి చేతిలో ఉంది. కోల్కా అతడి కళ్లల్లోకి చూడటానికి ప్రయత్నించాడు కానీ అతడు ముఖం తిప్పేసుకున్నాడు. కోల్కా గుసగుసగా అడిగాడు, "అలా ఎలా చేశారు, నాన్నా? అవి కూడా ప్రాణమున్న జీవులేగా..."

"ఊం," నిట్టూర్చాడు యెగార్. "లోకం అలాగే ఉందనుకుంటా, కొడుకా..."

అతడి గుండె బరువెక్కింది. వెంటనే అక్కడినుంచి వెళ్లిపోవాలని ఉంది. కాని వెళ్లమని వాళ్లు ఇంకా చెప్పలేదు. ఒక్క మాట కూడా మాట్లాడకుండా అతడు మంట వెయ్యటానికి అన్ని ఏర్పాట్లు చేశాడు. అది అయిన తరువాత ఆడవాళ్లు దుప్పటి పరిచి ఆహారం బయటకు తీసారు.

"రండి," వాళ్లు పిలిచారు, "తొందరగా కొంచెం తిందాం."

"అబ్బే... మాకు... ఏమీ వద్దు."

“ప్రతి పనికి ఫలితం ఉండాలి,” అన్నాడు బూడిద జుట్టోడు. “ఉదాహరణకు పిల్లవాడికి కైమా ఉండ. ఏయ్, అబ్బాయ్, కైమా ఉండ కావాలా?”

కైమా ఉండ అనేసరికి కోల్కా కాదనలేకపోయాడు: అది తినే అవకాశం అతడికి ఎప్పుడోగాని రాదు. ఇంకా నేలచూపులు చూస్తూ, నిట్టూరుస్తూ ఉన్న తండ్రిని దాటి ఒక అడుగు వాళ్లవైపుకి వేశాడు. యెగార్ కోల్కా వైపుకి చూసి, “నీ చేతులు మురికిగా ఉన్నాయి, వెళ్లి కడుక్కుని రా,” లోస్వరంలో అన్నాడు.

క్షణంలో చేతులు కడుక్కుని వచ్చిన కోల్కాకి ఒక కైమా ఉండ ఇచ్చారు. ఒకవైపున అతడికి సంతోషంగా ఉంది, కానీ ఇంకో వైపున ఆ చీమలే అతడి కంటిముందు కదలాడుతున్నాయి. గందరగోళంగా అటూ, ఇటూ పరిగెడుతున్న చీమలు. ధైర్యంగా మంటలలోకి దూకుతూ, ఆ వేడికి మాడిపోతున్న చీమలు.

యెగార్‌కి కూడా ఆ చీమలే కనపడుతున్నాయి. వాటిని పోగొట్టటానికి, తన స్మృతి పథం నుంచి తొలగించటానికి అతడు కళ్లు నులుముకున్నాడు. కానీ, అవి మళ్లీ, మళ్లీ పాకుతూ వస్తూనే ఉన్నాయి. అతడికి నీరసంగా ఉండి, ఏమీ చెయ్యాలనిపించటంలేదు. వాళ్లతో కూర్చుని ఆహారం తినాలని అస్సలు లేదు. కానీ వాళ్లు రెండోసారి పిలిచేసరికి వెళ్లి వాళ్లతోపాటు కూర్చున్నాడు. అతడు ఏమీ మాట్లాడకుండా కూర్చున్నాడు. అయితే తనని కూడా పిలిచినందుకు ధన్యవాదాలు తెలిపి ఉంటే బాగుండేది. అతడు మౌనంగా కూర్చున్నాడు, మౌనంగానే బూడిద జుట్టోడు ఇచ్చిన మగ్గు అందుకున్నాడు.

“తాగు, యెగార్. అలసిపోయినప్పుడు నువ్వు తాగుతావు, కదా? అది నీ కళ్లల్లో కనపడుతోంది.”

“అవును... అప్పుడప్పుడు.”

“ఇది కూడా అటువంటి సందర్భమే అనుకో.”

“సరే, మీ సెలవలకీ, మీ ఆరోగ్యానికీ.”

ఆ మాటలు అతి కష్టం మీద అతడి నోటి నుంచి వచ్చాయి. అతడి హృదయాన్ని ఏదో నీడ కమ్ముకుంది. ఇతరులకోసం ఆగకుండా మగ్గులోనిదంతా గటగటా తాగేసాడు.

“అదీ రష్యన్ తీరంటే!” సగం బట్టతలోడు ఆశ్చర్యంగా అన్నాడు.

జీవితంలో అంత మోతాదు యెగార్ ఎప్పుడూ తాగలేదు.

అంతేకాకుండా అతడు తాగింది ఓడ్కా కంటే చాలా ఘాటైనది: అది నేరుగా అతడి మెదడులోకి వెళ్లి చీమలనన్నింటిని తుడిచేసింది. అక్కడ ఉన్న వాళ్లంతా ఎంతో ఆత్మీయుల్లాగా అనిపించి యెగార్ తన బెరుకునంతటినీ మరిచిపోయాడు. నోటిని ఈ చివరినుంచి ఆ చివరి దాకా సాగదీసి నవ్వుతూ మాటల ప్రవాహంలో పడిపోయాడు.

"ఇక్కడ అంతటా ప్రకృతి ఉంది. అవును. మీ ప్రపంచం నుంచి బయటపడాలనుకున్నప్పుడు మీరు ఇక్కడికి రావాలి. నిశ్శబ్దం, ప్రశాంతత. మనిషికి ఏం కావాలి? అతడికి ప్రశాంతత కావాలి. ప్రతి జంతువు, ప్రతి పురుగు, అంతెందుకు ప్రతి చెట్టు – తమ ప్రశాంతత కోసం పాకులాడుతుంటాయి. చీమలు, ఈ చీమలు కూడా... అదే కోరుకుంటున్నాయి."

"నువ్వు తత్త్వవేత్తవి, యెగార్," బూడిద జుట్టోడు నవ్వాడు. "నీ సిద్ధాంతం ఏమిటి?"

"ఆగండి అయ్యలారా, ఆగండి. నేను ఏం చెబుతున్నాను? నేను కోరుకునేది ఏమిటంటే –"

"నీకు ఇంకొంచెం మందు కావాలి!"

"ఆగండి అయ్యలారా, ఆగండి..."

యెగార్ కొంచెం తాగిన తరువాత అందరినీ అలాగే సంబోధిస్తాడు, అయ్యలారా అంటూ. ఒక రకంగా చెప్పాలంటే ఇది మొదటి దశ. రెండవ దశకి మరింత సాన్నిహిత్యం ఏర్పడి "మిత్రులారా" అంటూ సంబోధిస్తాడు. అందరిపైనా అంతులేని ప్రేమను కురిపిస్తూ అతడి కళ్లు మిటకరిస్తూ ఉంటాయి. అకారణంగా అందరిపైనా జాలి కలుగుతుంది. ఏవో మంచి మాటలు, అందరినీ సంతోషపరిచే మాటలు చెప్పటానికి ప్రయత్నిస్తాడు. కానీ అతడి ఆలోచనలు కూడా ఎర్ర చీమల మాదిరి గందరగోళంగా అటూ, ఇటూ పరిగెడుతున్నాయి. తన ఆలోచనలను వ్యక్తపరచటానికి సరిపడేటన్ని మాటలు అతనికి ముందునుంచి లేవు. అదే రెండో గ్లాసు తాగితే మెదడు పూర్తిగా మబ్బేసి పోతుంది.

"మనిషి వ్యధకు లోనవుతాడు. అంతులేని వ్యధ నా ప్రియమైన మిత్రులారా. ఎందుకని? ఎందుకంటే మనమంతా అనాథలం. తల్లి ప్రకృతితో సంబంధం లేదు, తండ్రి అడవితో తగాదా, సోదరి నదితో విరోధం. మనిషి నిలబడటానికి, దేనికైనా ఆనుకోటానికి ఎటువంటి ఆధారమూ లేదు; పునరుత్తేజం కావటానికి ఏమీ మిగలలేదు. ఇది మీకు ప్రత్యేకంగా వర్తిస్తుంది నా ప్రియమైన,

మంచి మిత్రులారా. మీరు అందరికంటే ఎక్కువ వ్యధకు లోనౌతారు. మీ పైన ఆకాశం బూడిద రంగులో ఉంటుంది. మాది నీలం ఆకాశం. మరి నీలం ఆకాశం మీద నలుపెలా కూర్చుంటుందని అడుగుతున్నాను? స్వర్గపు నీలం మీద అంకెలా? లేదు అయ్యలారా, లేదు నా ప్రియమైన మిత్రులారా, ఆకాశం మీద అంకెలు ఏమాత్రం బాగుండవు. అది ఉన్నది మరో దానికోసం, అందం కోసం, ఆత్మ ఊపిరి తీసుకోవటం కోసం. అవును!"

"నువ్వు మంచి కథకుడివి, కవివోయ్!"

"ఆగండాగండి, నా ప్రియమైన మిత్రులారా. నేను ఏమి చెప్పదలుచుకున్నాను? అందరూ బాగుండాలి, అంతే. అందరికీ తగినంత వెచ్చని ఎండ ఉండాలి, వానజల్లులో అందరూ పరవశించాలి, పచ్చటి గడ్డినుంచి అందరూ సంతోషం పొందాలి. అంతటా మరింత ఆనందం వెల్లివిరియాలని కోరుకుంటున్నాను నా ప్రియమైన మిత్రులారా! మనిషి తన ఆత్మానందం, సంతోషం కోసం పనిచేయాలి."

"దానికి బదులు మమ్మల్ని సంతోషపరచటానికి నువ్వు నాట్యం చేయవచ్చు కదా. ఏమంటావు? ఉయ్యాల, ఉయ్యాల, ఉయ్యాలో! సిరిమల్లె చెట్టుకింద ఉయ్యాలో!"

"వద్దు!" ఎర్రటి అమ్మాయి అడ్డుపడింది. "ఏం చేస్తున్నారు – అతడు సరిగ్గా నిలబడను కూడా నిలబడలేడు!"

"ఎవరు నిలబడలేనిది? యెగార్ నిలబడలేడా? మన యెగార్ రాయిలాగా ఉన్నాడు!"

"రా, యెగార్ నేస్తమా! మేమంటే నీకు గౌరవం ఉందా?"

"ఉంది, నా ప్రియమైన మిత్రులారా!"

"నాన్నా, వద్దు!"

"తప్పదు, కోల్కా. వీళ్లను గౌరవించాలి, సంతోషంగా. అందరినీ సంతోషపరచాలి! మీరు చీమలను తగలబెట్టారు. అయితే ఏమిటంట నా ప్రియమైన, మంచి మిత్రులారా!"

సగం బట్టతలోడు తప్పట్లు కొట్టసాగాడు:

"ఉయ్యాల, ఉయ్యాల, ఉయ్యాలో... రా, యెగార్!"

వాళ్లు పాటలు పాడుతూ, తప్పట్లు కొడుతున్నారు: కోల్కా, ఎర్రటి అమ్మాయి మాత్రం కోపంగా చూస్తూ ఉండిపోయారు. కానీ యెగార్‌కి వాళ్లు కనపడటం లేదు. అతడికి నిలకడలేని, గాలిలో తేలుతున్న ముఖాలు కనపడుతున్నాయి. ఆ ముఖాలన్నీ నవ్వుగా విరబూస్తున్నట్టు ఉన్నాయి.

“ఓ నా ప్రియమైన, మంచి మిత్రులారా! మిమ్మల్ని గౌరవించకుండా ఎలా ఉంటాను?”

మూడుసార్లు అతడు లేచాడు – మూడుసార్లూ అతడు పడిపోయాడు. పడి, కళ్లవెంట నీళ్లు కారేవరకు నవ్వాడు. మిగిలినవాళ్లు కూడా నవ్వుతూ ఆనందిస్తున్నారు. చివరికి ఎలాగో లేచి నిలబడి, చేతులను అన్నివైపులకి ఊపుతూ, తూలుతూ వింతగా నడవసాగాడు. కాని అతడి కాళ్లు ఊగుతూ, మెలిపడిపోతూ తను కావాలనుకున్న చోట తప్పించి అంతటా అడుగు పడుతోంది. పర్యాటకులు పెద్దపెట్టున నవ్వసాగారు. వాళ్లల్లో ఒకరు యెగార్‌తో కలిసి నాట్యం చేయసాగారు. ఎర్రటి అమ్మాయి మాత్రం కోల్కాని హత్తుకుని అతడికి మిఠాయిలు ఇచ్చింది.

“ఆందోళనపడకు, కోల్కా. ఇది ఎంతో సేపు ఉండదు. నీకు తెలుసుగా, ఇది తాత్కాలికమైనది.”

కోల్కా మిఠాయి తీసుకోలేదు. కన్నీళ్లగుండా జరుగుతున్నదంతా చూస్తున్నాడు. అవి కోపంతో మండుతున్న కన్నీళ్లు.

“రా, యెగార్, గెంతుతూ ఆడు!” బూడిద జుట్టోడు అరిచాడు. “ఇదంతా చాలా బాగుంది!”

“ఓ ప్రియమైన మిత్రమా, నీ కోసం...”

యెగార్ ముఖాన్ని చిత్రవిచిత్రంగా పెట్టసాగాడు. అతడు మళ్లీ పడిపోయి, నవ్వాడు. అతడి నవ్వు హృదయాంతరాళాల్లోంచి వచ్చినది, మనస్ఫూర్తిగా నవ్వినది: అతడికి అదంతా బాగుంది, నిజంగా బాగుంది.

“ఉయ్యాల, ఉయ్యాల, ఉయ్యాలో! తప్పట్లు కొట్టు, కాళ్లు ఆడించు!”

“వద్దు...” కోల్కా ఉన్నట్టుండి ఎర్రటి అమ్మాయి చేతులనుంచి విడిపించుకుని పెద్దగా అరిచాడు. “ఆపు నాన్నా, ఆపు!”

“ఆగు కొడుకా, ఆగు. ఇప్పుడంతా సెలవలు! మనకి కొంతమంది మంచి మనుషులు కలిశారు. నిజానికి అద్భుతమైన మనుషులనాలి!”

అలా అంటూ మళ్లీ ఒకసారి ప్రయత్నించాడు: ఊగి, తూలి, పడిపోయి లేచాడు. “నాన్నా, ఆపు...” కళ్లనీళ్లతో కోల్కా అరుస్తూ అక్కడినుంచి వాళ్ల నాన్నను లాగసాగాడు. “ఆపు...”

“మా సంతోషంలో జోక్యం చేసుకోకు, అబ్బాయీ! వెళ్లు, ఇక్కడనుంచి పో.”

“ఆ కాళ్లు కదుల్చు, యెగార్! నువ్వు నిజంగా బాగా చేస్తున్నావు!”

“మీరు నీచులు!” కోల్కా అరిచాడు. “నీచులు, క్రూరులు! మీకు మేం ఆ చీమలలాంటి వాళ్లం కదూ? కేవలం చీమలం!”

“ఓయ్, యెగార్, నీ కొడుకు మమ్మల్ని అవమానిస్తున్నాడు. ఇదేం బాగాలేదు.”

“తండ్రిగా నీ అధికారాన్ని మాకు చూపించు, యెగార్!”

“మీకు సిగ్గులేదు!” ఎర్రటి అమ్మాయి అరిచింది. “అతడు తాగి, సరైన స్థితిలో లేడు. ఇలా ఎలా ప్రవర్తిస్తారు?!”

కానీ ఆమె మాటలను ఎవరూ పట్టించుకోలేదు: వాళ్లకి అదంతా చాలా సరదాగా ఉంది. వాళ్లు అరుస్తూ ఈలలు వేస్తున్నారు; తప్పట్లు కొడుతూ, నాట్యం చేస్తున్నారు. కోల్కా పెద్దపెట్టున ఏడుస్తూ, తండ్రిని లాగటానికి ప్రయత్నిస్తున్నాడు. యెగార్ అతడిని నిరోధిస్తూ, పడిపోతూ ఉన్నాడు.

“అతడిని ఒక్కటెయ్యి, యెగార్! వేలెడంత లేడు, పెద్దవాళ్లమీద ఏమిటి ఆ పెత్తనం.”

“నువ్వు చిన్నవాడివి, పెద్దవాళ్లతో నీకు ఏం పని...” కోల్కాని తోసేస్తూ యెగార్ గొణిగాడు.” ఇక్కడినుంచి పో. చెరువు కట్టవెంట ఇంటికి వెళ్లు.”

“నా-న్నా!”

ఫాట్!

యెగార్ ఊగుతూ ఒక్కటిచ్చాడు. తన జీవితంలో కొడుకుని కొట్టడం అదే మొదటిసారి, అతడు భయపడిపోయాడు: అతని గుండె గడ్డకట్టుకుపోయింది. ఉన్నట్టుండి అందరూ నిశ్శబ్దంగా మారిపోయారు. గెంతులు కూడా ఆగిపోయాయి. ఎవరో కట్టేసినట్టు కోల్కా వెంటనే ఏడవటం ఆపేశాడు. నిశ్శబ్దంగా నిలబడి, ముఖాన్ని చొక్కాకి తుడుచుకుని, మబ్బులు కమ్మిన తండ్రి ముఖంలోకి చూసి, అక్కడినుంచి వెళ్లిపోయాడు.

"కోల్కా! కోల్కా, వెనక్కి రా!" అతడి వెనకే ఎర్రటి అమ్మాయి అరిచింది. కోల్కా వెనక్కి తిరిగి చూడను కూడా చూడలేదు. చెరువు గట్టువెంట పొదలగుండా, కన్నీటితో అతడు వెళ్ళిపోసాగాడు. కొంచెం సేపటికి అతడు కనుమరుగయ్యాడు.

అక్కడంతా నిశ్శబ్దంగానూ, ఇబ్బందికరంగానూ మారిపోయింది. ఏమీ మాట్లాడకుండా నేల చూపులు చూస్తూ యెగార్ తూలుతూ ఉన్నాడు. ఎవరి నోటనుంచి ఒక్క మాట కూడా రాలేదు.

"మీరు చేసిన పనికి సిగ్గుపడాలి!" ఎర్రటి అమ్మాయి పెద్దగా అరిచింది. ఆ తరువాత ఆమె గుడారంలోకి వెళ్ళిపోయింది. తాము చేసిన పనికి అందరూ సిగ్గుపడసాగారు, ఎదుట వాళ్లతో కళ్లు కలపలేకపోయారు. బూడిద జుట్టోడు నిట్టూర్చి చెప్పసాగాడు, "ఆ ఉత్సాహంలో ఏం చేస్తున్నమో మాకే తెలియలేదు. సరేనోయ్, జరిగిందేదో జరిగిపోయింది. ఈ మూడు రూబుళ్లు తీసుకుని, పడవెక్కి నువ్వు వెళ్లిపో."

ఆ డబ్బులు తీసుకుని యెగార్ తూలుతూ చెరువు కట్టవైపుకి నడవసాగాడు. యెగార్ కట్టవాలు మీద తడబడటం, నీళ్లల్లో నడుస్తూ పడవను చేరుకోవటం, పడవలోకి ఎక్కటానికి ప్రయత్నిస్తూ ఎక్కలేకపోవటం అందరూ నిశ్శబ్దంగా చూస్తూ ఉన్నారు. "తాగుబోతు వెధవ," రాగిజుట్టు అమ్మాయి చీదరించుకుంటూ అంది.

ఎంతో కష్టంమీద యెగార్ పడవలోకి ఎక్కాడు. తెడ్లమీద తూలిపడుతూ ఎలాగో పడవని తీరం నుంచి నీటి లోపలికి తీసుకెళ్లాడు. తరువాత తూలుతూ లేచి నిలబడి మోటారుకి తాడు చుట్టి లాగబోయాడు. అంతలోనే పట్టుతప్పి నీళ్లల్లో పడిపోయాడు.

"అతడు మునిగిపోతాడు!..." కీచుమంటూ అరిచింది రాగిజుట్టు అమ్మాయి.

యెగార్ నీటినుంచి బయటకు వచ్చాడు: నీళ్లు అతని ఛాతీ వరకే వచ్చాయి. అతడి ముఖమంతా బురదయ్యింది. పడవ పక్కలను పట్టుకుని అందులోకి ఎక్కటానికి ప్రయత్నంచసాగాడు.

"అతడు మునగడు," అన్నాడు బూడిద జుట్టోడు. "అక్కడ లోతు తక్కువగా ఉంది."

"ఓ మిత్రమా, తెడ్లు ఉపయోగించు!" బట్టతలోడు పెద్దగా అరిచాడు. "మోటరు సంగతి మరిచిపోయి, తెడ్లు ఉపయోగించు!"

"బాతుపిల్ల!" ఉన్నట్టుండి యెగార్ నవ్వుతూ బదులిచ్చాడు. "ఇది నా చిన్నారి బాతుపిల్ల! బాతుపిల్ల, పందిపిల్ల పందెం వేసుకుంటున్నాయి!"

పడవ పక్క అంచులు చాలా ఎత్తుగా ఉన్నాయి. లోపలికి ఎక్కటానికి యెగార్ తన శక్తినంతటిని ఉపయోగించి దానిని ఊపసాగాడు. అది అలా ఊగుతూ ఉండగా దాంట్లోకి ఎక్కబోయాడు. కానీ ఉన్నట్టుండి పడవ అతని నుంచి జారిపోయి తిరగబడింది. తళతళ మెరుస్తున్న తెడ్లు బురద నీటిలో తేలియాడుతున్నాయి. యెగార్ మళ్లీ నీటిలో మునిగి, గుర్రంలా సకిలిస్తూ పైకి వచ్చాడు. ఇక పడవని సరిగా తిప్పటానికి కూడా ప్రయత్నించకుండా నీటిలో తాడుకోసం వెతికి పట్టుకుని పడవని లాక్కుంటూ తీరం వెంట తడబడుతూ నడవసాగాడు.

"ఓయ్, ఏమైనా సహాయం కావాలా?" బట్టతలోడు అడిగాడు.

యెగార్ బదులు పలకలేదు. అతని వళ్లంతా బురద అయ్యింది, నీళ్లు అతని ఛాతీ వరకు ఉన్నాయి. తడబడుతూ అడుగులేస్తూ నీట మునుగుతాడు, తల విదిలిస్తూ, నీళ్లు ఊస్తూ మళ్లీ బయటకు వస్తాడు. కానీ తాడు జారిపోకుండా గట్టిగా పట్టుకుని ఉన్నాడు. తిరగబడిన పడవ భారంగా అతడి వెనక వస్తోంది. అయితే మోటరు పడవలో లేదు. మోటరే కాదు, పెట్రోలు ట్యాంకు, మిగిలిన సామానంతా నీట మునిగిపోయింది. అయితే యెగార్ వెనక్కి తిరిగి చూడలేదు, అప్పుడతనికి అంత స్పృహ కూడా లేదు. చెరువు అంచు వెంట పడవను లాక్కుంటూ వెళ్లాడు. అక్కడ యకోవ్ ప్రొకొపిచ్ ఆందోళనతో ఎదురు చూస్తూ ఉన్నాడు.

*(తరువాయి భాగం వచ్చేవారం)*

For Latest Telugu Books - Visit now:
Kinige.com